క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం


విరాళం అందజేస్తున్న పొంగులేటి

పాల్వంచరూరల్: సంగం గ్రామంలో నిర్మిస్తున్న శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ నిర్మాణ పనులకు ఖమ్మం పార్లమెంట్ మాజీ సభ్యుడు పొంగులేటి శ్రీనివాసరెడ్డి రూ.లక్ష విరాళాన్ని ఇచ్చినట్లు ఆదివారం ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో జాలే జానికిరెడ్డి, ఎస్వీ రామానుజాచార్యులు, బ్యాంక్ చారి, ఎస్వీ శేషాచార్యులు, వింజమూరి వేణు, మురళి, ఎస్వీ గోపాలచార్యులు, అపోజి సత్యనారాయణ, కిరణ్‌ఉన్నారు.

ముదిరాజ్ సంఘం కమిటీ ఎన్నిక


ముదిరాజ్ నూతన కమిటీ సభ్యులు

ఇల్లెందురూరల్: పట్టణంలోని ఆర్అండ్ఆర్ కాలనీలో ఆదివారం ముదిరాజ్ సంఘం నూతన కమిటీని శివశక్తి దండు సారయ్య స్వగృహంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కులపెద్దలుగా దండు సారయ్య, ఉప్పరి సమ్మయ్య, రాజబోయిన కొమరయ్య, ఇట్టబోయిన మల్లేష్, నక్క మల్లేష్, కాటబోయిన రాజు, ఈర్ల కట్టయ్య, ఉప్పరి జంపయ్య, భాషబోయిన అశోక్, గాజే పగడయ్య, మేకల సమ్మయ్యలతోపాటు మహిళా ప్రతినిధులుగా పద్మ, రాజమ్మ, తార, సుజాత, లావణ్య, యాదిలక్ష్మి, స్వరూప, కవిత, రాంబాయి, విజయ, యూత్‌ప్రతినిధులుగా సంతోష్, సందీప్, ప్రసాద్, పవన్, రాజు, ప్రవీణ్, పవన్, సతీష్, అరవింద్, సాయి, చరణ్, స్వామి, సాయికిరణ్, రాజు, సాయి, సోషల్ మీడియా ప్రతినిధిగా వెంకటేష్, ప్రచార కార్యదర్శిగా అశోక్‌లను ఎన్నుకున్నారు.

డైరీ, క్యాలెండర్లు ఆవిష్కరణ


క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న సంఘం సభ్యులు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలో ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ డైరీ, క్యాలెండర్ల ఆవిష్కరణ ఆదివారం జరిగింది. అనంతరం నూతన జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎన్నికలో జిల్లా అధ్యక్షుడిగా నాయిని రాజేష్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి బండారి సాగర్, కోశాధికారిగా పగడాల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా సానబోయిన రాజు, గంట హనుమంతరావు, దువ్వ సంపత్, సంయుక్త కార్యదర్శిగా రాగుల హరీష్, కొల నాగవర్మ, సొప్పరి క్రాంతి, కార్యవర్గ సభ్యులను ఎన్నిక చేశారు. జిల్లా నుంచి రాష్ట్ర కమిటీలోకి ఎన్నికైన సొప్పరి రమేష్, కాసబోయిన శ్రీనివాస్, కోళ్ల వెంకటేశ్వర్లు, అక్కల శ్రీనివాస్‌లను సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేష్ మాట్లాడుతూ.. ముదిరాజ్ ఎంప్లాయిస్ హక్కుల సాధనకు, అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

కేసీఆర్ తాత.. స్పందించండి


జేపీఎస్‌ల దీక్షలో తల్లికి మద్దతుగా ప్లకార్డులు ప్రదర్శిస్తున్న చిన్నారులు

డిమాండ్ల పరిష్కారం కోసం సమ్మె కొనసాగిస్తున్న జేపీఎస్‌లు ఆదివారం మూడో రోజు మూతికి నల్లరిబ్బన్లు ధరించి మౌన దీక్ష చేపట్టారు. సమ్మెలో భాగంగా దీక్షలో ఉన్న చుంచుపల్లి మండలం వెంకటేశ్వరకాలనీకి చెందిన జేపీఎస్ వసంతకు మద్దతుగా ఆమె ఇద్దరు కూతుళ్లు కలెక్టరేట్ వద్ద శిబిరానికి హాజరై సంఘీభావం తెలిపారు. సీఎం కేసీఆర్ తాతా.. మా అమ్మను రెగ్యులర్ చేయండి.. అంటూ ప్లకార్డులను ప్రదర్శించారు. తల్లికి మద్దతుగా దీక్షకు వచ్చిన ఇద్దరు చిన్నారులను జేపీఎస్‌లు పలువురు అభినందించారు. జిల్లా వ్యాప్తంగా 377 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులు విధులను బహిష్కరించి సమ్మెలో ఉన్నారు.
– చుంచుపల్లి

సమస్యలతో సతమతం

తాగునీటి పైపులైన్‌కు లీకేజీలు

- ఒడ్డుగూడెం, టీచర్స్ కాలనీల్లో పారిశుద్ధ్యం లేకపోవడంతో రోడ్లపైనే పారుతున్న మురుగు
- మిషన్ భగీరథతో ధ్వంసమైన రోడ్లు
- పట్టించుకోని మున్సిపాలిటీ అధికారులు


మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీతో రోడ్డుపై పారుతున్న తాగునీరు

పాల్వంచ: మున్సిపాలిటీలో సమస్యలతో స్థానికులు సతమతమవుతున్నారు. సమస్యలపై అధికారులు చిత్తశుద్ధితో పనిచేయడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. అన్ని ఏరియాల్లో రోడ్లు, డ్రైయినేజీ, తాగునీటి సమస్యలు వెంటాడుతున్నాయి. అధికారులు ఎప్పటికప్పుడు తూతూ మంత్రంగా తాత్కాలిక పనులు చేసి చేతులు దులుపుకుంటున్నారు. కంటితుడుపు చర్యలు తప్ప శాశ్వత పరిష్కారం చూపకపోవడంతో చేసిన పనులే మళ్లీ, మళ్లీ చేస్తూ కాలం వెల్లదీస్తూ లక్షలాది రూపాయల ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు.

పైపులైన్ల లీకులే లీకులు..

మున్సిపాలిటీలో తాగునీటి సమస్య వెంటాడుతోంది. ఈ కాలనీలో చూసినా పైపులైన్ల లీకేజీలతో తాగునీరు వృథా అవుతోంది. నిత్యం రోడ్లన్నీ జలమయంగా మారుతున్నాయి. లీకేజీల వల్ల నీటి వృథాతో పాటు, ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఒడ్డుగూడెం నుంచి టీచర్స్ కాలనీ రోడ్డు, గట్టాయిగూడెం ఏరియాల్లో అడుగడుగునా పైపులైన్ల లీకేజీలు ఉన్నాయి. ఎక్కడ చూసినా నీళ్లు రోడ్లపైనే నిలుస్తున్నాయి.

డ్రైయినేజీల్లో నిండిన మురుగు..

డ్రైయినేజీల్లో మురుగు నిండి రోడ్లపై పారుతోంది. ఒడ్డుగూడెం నుంచి కేఎస్‌పీ రోడ్‌లో సైడుకాలువల్లో నెలల తరబడి పూడిక తీయడం లేదు. దీంతో మురుగు నీరు నిండి రోడ్లపై పారుతోంది. మురుగు నీరు రోడ్డెక్కడంతో దుర్వాసన వెదజల్లుతోంది. పారిశుద్ధ్యంపై ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

సీతారాంపట్నం రహదారిలో రోడ్డు ధ్వంసం...

భగీరథ పైపులైన్ల ఏర్పాటు కోసం అనేక ఏరియాల్లో రోడ్లను ధ్వంసం చేసి పైపులు వేస్తున్నారు. దీనివల్ల బాటసారులకు, వాహనదారులకు ఇబ్బందికరంగా మారింది. రోడ్లపై భారీగా గుంతలు ఏర్పడ్డాయి. గట్టాయిగూడెం నుంచి సీతారాంపట్నం వెళ్లే దారిలో మారుతీనగర్ వద్ద సీసీ రోడ్డు పగలగొట్టడంతో పెద్ద గుంతలు ఏర్పడటంతో స్థానికులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈవిషయమై మున్సిపల్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులో లేరు.


పైపులైన్ వల్ల దెబ్బతిన్న సీతారాంపట్నం రోడ్డు

సీసీ రోడ్డు నిర్మించాలి



మిషన్ భగీరథ పైపులైన్ల ఏర్పాటు కోసం సీసీ రోడ్లను ధ్వంసం చేశారు. వీటిని సకాలంలో పూడ్చక పోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. సీతారాంపట్నం వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారింది. అధికారులు తక్షణం స్పందించి సీసీ రోడ్డు వేయాలి.
– లింగం రవికుమార్, స్థానికుడు

పైపులైన్ల లీకేజీలు అరికట్టాలి



తాగునీటి పైపులైన్లు అడుగడుగునా లీకేజీలు ఏర్పడ్డాయి. దీనివల్ల నీటి వృథా అవుతోంది. తాగునీటిలో మురుగు నీరు చేరి అనారోగ్యాల బారిన పడుతున్నారు. పైపులైన్ల లీకేజీలకు తాత్కాలిక మరమ్మతులు చేసి చేతులు దులుపుకుంటున్నారు.
– తంతెనపల్లి వెంకన్న గౌడ్, స్థానికుడు

ఘనంగా ఆరాధనోత్సవాలు


టేకులపల్లి: ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

జూలూరుపాడు: శ్రీశ్రీశ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆరాధన మహోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం విశ్వబ్రాహ్మణులు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారు జీవసమాధి అయిన రోజును ఆరాధన మహోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది.పాపకొల్లు, కాకర్ల గ్రామాలలో శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో స్వామి వారి జెండాలను ఆవిష్కరించారు.

టేకులపల్లి: టేకులపల్లిలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఆరాధన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్న ప్రసాద వితరణ చేశారు. ఆ తరువాత స్వామివారిని గ్రామాల్లో ఆటపాటలతో, కోలాట నృత్యంతో ఊరేగించారు.

పాల్వంచరూరల్: లక్ష్మీదేవిపల్లిలోని శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఆదివారం ఆరాధన మహోత్సవాల సందర్భంగా హోమం పూజలు నిర్వహించారు. ఉజ్జయిని పీఠాధిపతులు యోగి పీర్ రామ్‌నాథ్ బాబాజీ మహారాజ్ సందర్శించి విశ్వకర్మ పతాకావిష్కరణ జరిపారు. అనంతరం పూజారి నాగచారి ఉద్వాసన బ్రహ్మంగారి జీవసమాధి ఘట్టాన్ని నిర్వహించారు.

ఉద్యోగ విరమణ పొందిన జీఎంకు సన్మానం


రమేష్‌బాబును సన్మానిస్తున్న అధికారులు

ఇల్లెందు: కొత్తగూడెం కార్పొరేట్ కార్యాలయంలో జీఎం (సివిల్) గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన సీహెచ్ రమేష్‌బాబును ఇల్లెందు ఏరియా అధికారులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఇల్లెందు జీఎం కార్యాలయంలో ఏర్పాటైన కార్యక్రమంలో రమేష్‌బాబును శాలువాతో సత్కరించారు. జీఎం షాలేము రాజు, అధికారులు శ్రీనివాస్, ప్రభాకర్‌రావు, మోహన్‌రావు, వెంకటరామచంద్ర, విజయ భాస్కర్, ఆనందరావు, దిలీప్‌కుమార్, ఆదినారాయణ, ధనుంజయ్‌రెడ్డి, సుధాకర్, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ భరోసా సభను జయప్రదం చేయండి


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కామేశ్

పాల్వంచ: ఈ నెల 7న హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో జరగనున్న తెలంగాణ భరోసా సభను విజయవంతం చేయాలని, ఈ సభకు బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు, ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి మాయావతి హాజరు కానున్నారని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేశ్ అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో మాయావతి పర్యటన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చడం కోసం మాయావతి లోక్‌సభలో తెలంగాణ బిల్లును ప్రవేశ పెట్టినప్పుడు 36 మంది ఎంపీల మద్దతు ఇచ్చారన్నారు. 1300 మంది అమరుల త్యాగాలతో ఏర్పడిన తెలంగాణాలో కేసీఆర్ కుటుంబం మాత్రమే భోగాలను అనుభవిస్తోందన్నారు. రాష్ట్రంలో ప్రశ్నపత్రాల లీకులు, స్కాంలు, అవినీతి పెరిగి పోతోందని విమర్శించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కోళ్లపూడి ప్రవీణ్‌కుమార్, కేతిని కుమారి, ఎర్రంశెట్టి రాజేశ్వరి, సరోజ, రమ తదితరులు పాల్గొన్నారు.

పేదలను పట్టించుకోని బీజేపీ


మాట్లాడుతున్న ప్రకాష్

జూలూరుపాడు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ భద్రాచలానికి చెందిన బీఆర్ఎస్ అభిమాని తూతిక ప్రకాష్ చేపట్టిన 11 జిల్లాలను కలుపుతూ నాలుగు వేల కిలోమీటర్ల జన చైతన్య బైక్ యాత్ర ఆదివారం జూలూరుపాడుకు చేరుకుంది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికి, తమ మద్దతు తెలిపారు. ప్రకాష్ మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్, నిత్యావసర వస్తుల ధరలను పెంచి సామాన్య ప్రజల నడ్డివిరిచిందని ఆరోపించారు. మోదుగు రామకృష్ణ, ఎస్కే మైబూ, పణితి వెంకటేశ్వర్లు, రామిశెట్టి నాగేశ్వరరావు, మాడుగుల నాగరాజు, నరసింహారావు పాల్గొన్నారు.

ప్రభుత్వం చొరవ చూపాలి


ఇల్లెందురూరల్: భిక్షాటన చేస్తున్న వీఓఏలు

పాల్వంచరూరల్: సెర్ప్ పరిధిలో పనిచేస్తున్న వీఓఏలను పర్మనెంట్ చేసి కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నరాటి ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు ఆదివారం ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడారు. వీఓఏల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చొరవ చూపాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి కె.సత్య, వీఓఏల జిల్లా నాయకులు దానం కనకలక్ష్మి, ఏలూరి దుర్గ, ముదిగొండ మహాలక్ష్మి, జ్యోతి, విజయ్, సత్యనారాయణ, రాధ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని వీఓఏలు స్పష్టం చేశారు. ప్రభుత్వ చిన్నచూపును నిరసిస్తూ వీఓఏలు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం 14వ రోజుకు చేరుకుంది. నిరసన కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని పలు వీధులలో భిక్షాటన చేశారు. కార్యక్రమంలో నవ్య, ప్రమీల, అబ్దుల్ నబి, తాళ్లూరి కృష్ణ, పాపారావు, మోతీలాల్, వసంతరావు, సుల్తానా, లీలావతి, లత, రజిత, వసంత, సునిత, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐకేఎంఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఊక్లా నాయక్



టేకులపల్లి: అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా టేకులపల్లికి చెందిన బాణోతు ఊక్లా నాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు ఇటీవల ఆలేరులో జరిగిన ఏఐకేఎంఎస్ రాష్ట్ర 2వ మహాసభలో ఎన్నిక జరిగింది. తునికాకు కల్లెదార్ల సంఘం నేతగా ఉన్న ఊక్లా మండలంలో నోముల పరశురామ్ ప్రజాపోరాటాలకు ఆకర్షితుడై ఎర్రజెండా బాట పట్టారు. 2013 నుంచి సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ మండల కార్యదర్శిగా కొనసాగుతున్నారు. 2017లో ఎన్డీ జిల్లా కమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఆ తరువాత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ప్రజా సంఘాల్లో చురుకైన పాత్ర పోషిస్తూ, ప్రజాపోరాటాలను నడిపించారు.

ప్రధాని 'మన్‌కీ బాత్' చరిత్రాత్మకం


చుంచుపల్లి: మన్‌కీబాత్‌ను తిలకిస్తున్న రంగాకిరణ్, అభిమానులు

చుంచుపల్లి: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేపట్టిన మన్‌కీ బాత్ కార్యక్రమం చరిత్రాత్మకమని బీజేపీ జాతీయ ఓబీసీ మోర్చా మీడియా సెల్ కోఆర్డినేటర్ కేవీ రంగాకిరణ్ అన్నారు. ఆదివారం మన్‌కీ బాత్ 100వ ఎపిసోడ్ కార్యక్రమం సందర్భంగా చుంచుపల్లి మండల అధ్యక్షుడు రాయుడు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో 207 పోలింగ్ బూత్‌లో జిల్లా మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు బైరి నిర్మల నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. కార్యక్రమంలో నరేంద్రబాబు, చింతలచెర్వు శ్రీనివాసరావు, జల్లారపు శ్రీనివాస్, సుబ్రహ్మణ్యం, సంతోష్, అనంతలక్ష్మి, అశ్విని, వసంత, సరిత, విజయ తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 100వ ఎపిసోడ్ మన్‌కీ బాత్ ప్రోగ్రాంను స్థానిక పట్టణంలో ఆదివారం బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ శ్రేణులు టీవీలో వీక్షించారు.

సేవా కార్యక్రమాలు కొనసాగిస్తాం..


అవార్డు అందజేస్తున్న గడల శ్రీనివాసరావు

కొత్తగూడెంరూరల్: పుట్టిన గడ్డ రుణం తీర్చుకునేందుకు జీఎస్ఆర్ ట్రస్టు సేవలు నిరంతరం కొనసాగిస్తామని ఆ ట్రస్ట్ చైర్మన్, రాష్ట్ర ప్రజా ఆరోగ్య సంచాలకులు గడల శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం కొత్తగూడెం క్లబ్‌లో మే డే కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని జీఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కొత్తగూడెంలో శ్రామిక శక్తికి ఎంపికైన కార్మికులకు శ్రామిక అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పుట్టిన గడ్డపై కార్మికుల దినోత్సవాన్ని జరుపుకోవటం సంతోషంగా ఉందన్నారు. కార్మికుల హక్కుల కోసం కార్మికులందరు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రపంచంలో 12 గంటల పని దినాలను కార్మికులందరూ ఐక్యంగా పోరాడి 8 గంటల పని దినాన్ని సాధించుకోవటమే కార్మికుల దినోత్సవం మే 1 తేదీని సూచించిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ ఉద్యమంతో ప్రారంభమైన పోరాటం, రాష్ట్ర ప్రగతి సహితం ఉద్యమంలా కొనసాగుతోందన్నారు. ముఖ్యమంత్రి రాష్ట్రాన్ని అన్ని విధాలుగా ముందుకు తీసుకెళ్తుందన్నారు. జిల్లాలో వైద్య రంగంలో ఇంకా ముందుకెళ్లేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. జీఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రెండేళ్లుగా కొత్తగూడెం నియోజకవర్గంలో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. భవిష్యత్‌లో ఉపాధి కల్పన, వైద్య, విద్యారంగంలో మరింత ముందుకెళ్లేందుకు నిరంతరం సేవా కార్యక్రమాలు చేస్తామన్నారు. డాక్టర్‌గా తెల్ల కోటు ధరించాల్సిన నేను కార్మికుల కోసం ఖాకీ చొక్కా ధరించటం జరిగిందన్నారు. అనంతరం గడల శ్రీనివాస్‌రావు సింగరేణి కార్మికుడిగా కార్మిక దుస్తులతోపాటు, టోపీ, చేతిలో చమ్మాస్ ధరించారు. అనంతరం కార్మికులకు శ్రామిక అవార్డులు పంపిణీ చేశారు. తొలుత లక్ష్మీదేవిపల్లి మండలం జీఆర్ఎస్ ట్రస్ట్ నుంచి కారులో కొత్తగూడెం పట్టణంలోని ఎంజీరోడ్డు గుండా కొత్తగూడెం క్లబ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తోట మల్లేష్, కేపీ రామారావు, తుమ్మల శ్రీనివాస్, జగడం కిరణ్, అర్షద్, నాగరాజు, సంపత్, సింధు, కృష్ణ, వీరబాబు, నాగేశ్వరరావు, ఎండీ షరీఫ్, జీఎస్ఆర్ ట్రస్టు సభ్యులు అంజి, మోదుగు జోగారావు తదితరులు పాల్గొన్నారు.

సమాన వేతనానికి పోరాడుదాం..


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇల్లెందురూరల్: మే డే స్ఫూర్తితో సమాన పనికి సమాన వేతనం కోసం ఉద్యమిద్దామని ఇఫ్టూ అనుబంధ తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు రావూరి ఉపేందర్ అన్నారు. మే డే ఉత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను మండలంలోని కొల్లాపురం గ్రామంలో ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మే 1న ప్రపంచ వ్యాప్తంగా కార్మిక పోరాట దినోత్సవాన్ని జరుపుకుంటున్నారని గుర్తుచేశారు. దీనిని పాలకులకు తొత్తులుగా కొనసాగుతున్న సంఘాలు వేడుకగా పేర్కొనడం సరికాదని, చికాగో అమరుల త్యాగాల దినమని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై చికాగో అమరుల స్ఫూర్తితో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పూనెం భద్రం, మోకాళ్ల శ్రీను, రాజు, వినోద్, రమేష్, విష్ణు, సతీష్, జాన్సన్, సురేష్, జలమయ్య, బంటి, చింటూ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ ఉద్యమాలను నిర్మిద్దాం


మాట్లాడుతున్న మల్లికా వల్లభ

ఇల్లెందురూరల్: పల్లెల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ ఉద్యమాలను బలంగా నిర్మించడమే జైభారత్ లక్ష్యమని జాతీయ సమితి సభ్యుడు మల్లికా వల్లభ తెలిపారు. పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఆదివారం ఏర్పాటైన సమావేశంలో ఆయన మాట్లాడారు. కుల నిర్మూలన కోసం పనిచేసిన నారాయణగురు, పూలే, అంబేడ్కర్, గాంధీ, థక్కర్, పాపా, లోహియా తదితర నాయకుల ఆశయమే ప్రధాన లక్ష్యంగా జైభారత్ ఎస్సీ, ఎస్టీ, బీసీ పోరాట వేదికలు పని చేస్తాయని చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఎస్సీ పోరాట వేదిక జిల్లా అధ్యక్షుడిగా బంగారం చిరంజీవి, ప్రధాన కార్యదర్శిగా శంకర్, బీసీ పోరాట వేదిక జిల్లా అధ్యక్షుడిగా తొగరు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా దాస్యం సురేంద్రబాబు, ఎస్టీ పోరాట వేదిక జిల్లా అధ్యక్షుడిగా కోరం అశోక్, ప్రధాన కార్యదర్శిగా మట్టా గంగరాజు సభ్యులుగా ఐలయ్య, నాగేశ్వరరావు, యాకూబ్‌అలీ, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి


పాల్వంచ: పూజలో పాల్గొన్న భక్తులు

పాల్వంచ: పట్టణంలో బొల్లేరుగూడెంలోని లలిత కామేశ్వరీ ఆలయంలో ఆదివారం ఆర్యవైశ్యుల కుల దైవం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పంచామృతాభిషేకం, వడి బియ్యం సమర్పించారు. కుంకుమార్చనలు, వాసవీ సేవాదళ్ ఆధ్వర్యంలో వాసవీ మాత పారాయణం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి తీర్థ, నైవేద్య ప్రసాదం అందించారు. కార్యక్రమంలో అమ్మవారి సేవాదళ్ అధ్యక్షులు చలవాది ప్రకాశ్, తాటికొండ సురేశ్, శ్రీనివాస్, గిరిధర్, రాజేశ్, రోజాలక్ష్మి, రాజ్యలక్ష్మి, శ్రీలక్ష్మి, కల్పన, అనిత, మణి, నిర్మల, శ్రీలత, విమల, పద్మజ, హారిక తదితరులు పాల్గొన్నారు.

జూలూరుపాడు: ఆర్యవైశ్యుల కులదైవం శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలను ఆదివారం జూలూరుపాడులో ఆర్యవైశ్యులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య మహిళలు కలశాలతో ప్రదర్శనగా బయలుదేరి జై వాసవీ.. జైజై వాసవీ అంటూ నినాదాలు చేస్తూ స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపానికి చేరుకున్నారు. పూజారులు శ్రీరామచంద్రమూర్తి, సాయికృష్ణ శర్మల ఆధ్వర్యంలో మంత్రోచ్చారణల నడుమ శ్రీగణపతి పూజ నిర్వహించారు. అదేవిధంగా శ్రీవాసవీ అమ్మవారికి అభిషేకం, అర్చనలు, ప్రత్యేక పూజలు, కుంకుమార్చన పూజలను మహిళలతో పూజారులు చేయించారు. కార్యక్రమంలో పెండ్యాల విజయ భాస్కర్, ప్రసాద్‌రావు, తొండెపు సుబ్బారావు, కొదుమూరి భానుప్రకాష్, వేముల గురునాథం, రామనరసింహారావు, కంచర్ల రామారావు, పెండ్యాల రాజశేఖర్, తొండెపు సరిత, కురివెళ్ల సంధ్యారాణి, తొండెపు నవీన్, పెండ్యాల కృష్ణమూర్తి, సత్యనారాయణ, వందనపు కమలాకర్, కురివెళ్ల కృష్ణారావు, చిట్లూరి మహేష్, తదితరులు పాల్గొన్నారు.


జూలూరుపాడులో ప్రత్యేక పూజలు చేస్తున్న ఆర్యవైశ్య మహిళలు

అటెన్షన్ ప్లీజ్

హెచ్చరిక బోర్డులేవి..?

భద్రాచలం రోడ్ టూ సత్తుపల్లి రైల్వే లైన్ నిర్మాణంలో భాగంగా గాయత్రీనగర్ వద్ద గత కొంతకాలంగా ఆర్వోబీ వంతెన పనులు సాగుతున్నాయి. వంతెనకు రెండు వైపులా సర్వీస్ బీటీ రహదారి పనులు సాగుతుండగా.. హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు వద్ద రాత్రి వేళల్లో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మూలమలుపు వద్దనే రహదారి మధ్యలో గుంతలు ఏర్పడటంతో వాహనాలు అదుపు తప్పి గుంతల్లో పడుతున్నాయి. కనీసం ఎటువంటి విద్యుత్ లైట్లు లేకపోవడంతో ప్రయాణికులు చీకటిలో అవస్థలు పడుతున్నారు.
– సుజాతనగర్



ప్రశ్నించాల్సిన అధికారి : శివగణేష్, ఆర్అండ్‌బీ ఏఈ
సెల్ నంబర్ : 9440819020